నమస్తే తెలంగాణ
రాజన్న సిరిసిల్ల
3 | కరీంనగర్, శుక్రవారం 6 డిసెంబర్ 2024 | RAJANNA SIRCILLA

మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

ప్రశ్నిస్తే అరెస్టులా..?

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

జగిత్యాల, డిసెంబర్ 5 : రాష్ట్రంలో పోలీస్ రాజ్యం నడుస్తున్నదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. హామీలు నెరవేర్చాలని ప్రశ్నిస్తే అరెస్ట్‌లు చేస్తారా..? అని నిలదీశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారని మండిపడ్డారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన బీఆర్ఎస్ నాయకుల అరెస్ట్‌లను ఖండించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అభివృద్ధే ధ్యేయంగా సుపరిపాలన అందించారని గుర్తు చేశారు. అప్పుడు ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో స్నేహపూర్వక వాతావరణం వుండేదని, ఇప్పుడు పోలీస్‌లను ముందు పెట్టుకొని ప్రభుత్వం అక్రమ అరెస్ట్‌లు చేయిస్తున్నదని దుయ్యబట్టారు. ఫిర్యాదు చేయడానికి వచ్చిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపైనే కేసు పెట్టడం ఎంత వరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. హరీశ్‌రావు, కేటీఆర్‌పై కేసులు పెట్టాలని చూస్తున్నారన్నారు. గురుకుల పాఠశాలలో భోజనం బాగాలేదని విద్యార్థులు ఆందోళన చేస్తే, దీని వెనుక బీఆర్ఎస్ హస్తం ఉందనడం విడ్డూరంగా ఉందన్నారు. విద్యార్థులకు మద్దతుగా గురుకులాలకు వెళ్తే తమను అరెస్ట్ చేయడం ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వం అంటే ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలని, మంచి పరిపాలన అందించి, ఇచ్చిన హామీలు నెరవేర్చాలని హితవుపలికారు. అనంతరం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు మాట్లాడుతూ, ఇప్పుడు తెలంగాణాలో ఎమర్జెన్సీ తలపిస్తున్నదని, మాట్లాడితే అరెస్ట్‌లు చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ఝూటా మాటలతో ప్రజలను నమ్మిస్తున్నాడని విమర్శించారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, మాజీమంత్రి హరీశ్ రావుపై, జగదీశ్వర్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డిపై అక్రమ కేసులు పెట్టడాన్ని బీఆర్ఎస్ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దావ వసంత మాట్లాడుతూ, ప్రజాపాలన అని చెప్పి ఇందిరమ్మ ఎమర్జెన్సీ పాలన చేస్తున్నారని ఆగ్రహించారు. గురుకుల విద్యార్థులకు సరిగ్గా అన్నం పెట్టని మీరు విజయోత్సవాలు దేనికి చేసుకుంటున్నారని నిలదీశారు. ఆడవాళ్లను కోటీశ్వరులను చేస్తామంటున్నారని, ముందుగా కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీ ఇవ్వాలని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో హరిచరణ్ రావు, లోక బాపు రెడ్డి, గోస్కుల జలందర్, మాధవ రావు, వొళ్లెం మల్లేశం, గంగారెడ్డి పాల్గొన్నారు.

కరీంనగర్ బైపాస్‌లోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద రాస్తారోకో చేస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్ బీఆర్ఎస్ నాయకులు

తిమ్మాపూర్ : రాజీవ్ రహదారిపై ధర్నా చేస్తున్న నాయకులు

కరీంనగర్ ఎన్టీఆర్ చౌరస్తా వద్ద రాస్తారోకో చేస్తున్న మాజీ ఎమ్మెలే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల

అరెస్టులపై ఆగ్రహం

- బీఆర్ఎస్ నాయకుల నిరసనల వెల్లువ
- ఎక్కడికక్కడ ధర్నాలు, రాస్తాకోలు
- కరీంనగర్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే గంగుల, మాజీ ఎమ్మెల్యే సుంకె
- వీణవంకలో రేవంత్ ప్లెక్సీ దహనం

కరీంనగర్ కార్పొరేషన్/ వీణవంక/ ఇల్లంతకుంట/ గోదావరిఖని, డిసెంబర్ 5 : మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి అరెస్టులపై ఆగ్రహం వ్యక్తమైంది. గురువారం ఎక్కడికక్కడ ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలతో హోరెత్తింది. కరీంనగర్ బైపాస్ రోడ్డులోని ఎన్‌టీఆర్ చౌరస్తా వద్ద సాయంత్రం భారీ రాస్తారోకో చేశారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పాల్గొనగా, నాయకులు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో హోరెత్తించారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఇక్కడ చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మేయర్ సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, గ్రంథాలయ మాజీ చైర్మన్ పొన్నం అనిల్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రెడ్డవేని మధు, మండలాల అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, శ్యాంసుందర్, బీఆర్ఎస్ నాయకులు ఐలేందర్, ప్రశాంత్‌రెడ్డి, తిరుపతినాయక్, సంపత్‌రావు పాల్గొన్నారు. ఎమ్మెల్యేల అరెస్ట్‌లను తీవ్రంగా ఖండించారు. ప్రజల పక్షాన పోరాడుతున్న బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్బంధకాండ కొనసాగిస్తున్నదని, ప్రభుత్వ తప్పులపై ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నదని మండిపడ్డారు. ఎమ్మెల్యేలను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని, వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీకాలనీ వద్ద రాజీవ్ రహదారిపై నాయకులు ధర్నాకు దిగారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. వీణవంకలో బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపి, రేవంత్ రెడ్డి బొమ్మ ఉన్న ఫ్లెక్సీని దహనం చేశారు. దీంతో పోలీసులు అడ్డుకొని మంటలను ఆర్పారు. ఇల్లంతకుంటలో నాయకులు నిరసన తెలిపి, ప్రభుత్వానికి వ్యతిరేక నినాదాలతో హోరెత్తించారు. ఎమ్మెల్యేలను అక్రమంగా అరెస్ట్ చేశారని బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ ఒక ప్రకటనలో ఖండించారు. రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తున్నదని మండిపడ్డారు.

ఎమర్జెన్సీ కంటే దారుణ పరిస్థితులు

రాష్ట్రంలో ఎమర్జెన్సీ కంటే దారుణమైన పరిస్థితులు ఉన్నాయి. ప్రజా సమస్యలపై కనీసం ప్రజాప్రతినిధులు కూడా మాట్లాడడం తప్పు అన్న విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. కాంగ్రెస్ పాలనలో ప్రజాప్రతినిధుల గొంతును కూడా నొక్కుతున్నారు. ఎమ్మెల్యేలకు కనీస స్వాతంత్ర్యం లేకుండా చేస్తున్నారు. అక్రమంగా కేసులు పెట్టి బీఆర్ఎస్ నేతలను అరెస్టు చేయడం సరి కాదు. అయినా ఇలాంటి అరెస్టులకు మేం భయపడేది లేదు. ప్రజలే కాంగ్రెస్‌కు తగిన రీతిలో బుద్ధి చెబుతారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించడం కూడా తప్పే అన్నట్టు కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. ఇలాంటి తీరును సహించేంది లేదు. ఎక్కడికక్కడ నిరసనలు తెలుపుతాం.

- కరీంనగర్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్

వీణవంక: రేవంత్ ప్లెక్సీని దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కాంగ్రెస్ కక్షసాధింపు చర్యలు

- బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్ 5: కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులపై కక్షసాధింపు చర్యలకు దిగుతున్నదని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్ మండిపడ్డారు. పథకం ప్రకారం అసెంబ్లీలో అడుగుపెట్టకుండా నిలువరించేందుకే ఎమ్మెల్యేలను అరెస్టు చేస్తున్నదని ఆరోపించారు. హుజూరాబాద్ పట్టణంలోని కౌశిక్ రెడ్డి నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఎమ్మెల్యేల అరెస్టును తీవ్రంగా ఖండించారు. తన ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారని ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై బంజారా హిల్స్ పోలీసులు దురుసుగా ప్రవర్తించి, అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేయడం అత్యంత దారుణమమన్నారు. ఆయనతోపాటు మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్ రెడ్డిపై పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యమంలో ఎన్నో అరెస్టులను చూశామని, ఎంత అణచివేయాలని చూసినా భయపడేది లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మండలాధ్యక్షుడు సంగెం అయిలయ్య, సీనియర్ నాయకులు ఇరుమల్ల సురేందర్ రెడ్డి, దయాకర్ రెడ్డి, ఇమ్రాన్, తొగరు భిక్షపతి, తొగరు శివ, కిరణ్ గౌడ్, పంజాల సదానందం, సతీశ్ గౌడ్, వెంకటేశ్ గౌడ్, బీఆర్ఎస్‌వీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్

మాట్లాడుతున్న బీఆర్ఎస్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, చిత్రంలో పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, నాయకులు

ప్రశ్నించే గొంతుకను ఆపలేరు

- హరీశ్‌రావు, కౌశిక్‌రెడ్డి అరెస్ట్ దురార్గమైన చర్య
- బీఆర్ఎస్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

సిరిసిల్ల టౌన్, డిసెంబర్ 5: ప్రజల సమస్యలపై ప్రశ్నించే గొంతుకలను అరెస్ట్‌లతో ఆపలేరని బీఆర్ఎస్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య స్పష్టం చేశారు. ప్రజాపాలన అందిస్తారనే నమ్మకంతో కాంగ్రెస్‌కు ఓటు వేసిన ప్రజలకు రాక్షస పాలన ఎలా ఉంటుందో చూపిస్తున్నారని ఆగ్రహించారు. ప్రభుత్వ నిర్బంధ పాలనకు భయపడేదిలేదని, తెలంగాణకు పోరాటం కొత్త కాదని, ప్రభుత్వ దుర్మార్గ చర్యలపై మరో పోరాటానికి ప్రజలంతా సిద్ధమవుతున్నారని హెచ్చరించారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నేతల అరెస్ట్‌ను తీవ్రంగా ఖండించారు. ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న నాయకులను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పోలీసులతో నిర్బంధిస్తున్నదని మండిపడ్డారు. తన ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారని ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డితోపాటు ఆయనతో మాట్లాడేందుకు వెళ్లిన ఉద్యమనేత హరీశ్‌రావు, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డిని అరెస్ట్ చేయడం బాధాకరమన్నారు. అయినా బీఆర్ఎస్ నాయకులకు అరెస్ట్‌లు కొత్తేమీ కాదని స్పష్టం చేశారు. ఉద్యమంలో ఎన్నో అక్రమ కేసులను ఎదుర్కొని జైలుకు వెళ్లిన సందర్భాలున్నాయని గుర్తు చేశారు. రాష్ట్రం సాధించిన బీఆర్ఎస్‌పై రేవంత్‌రెడ్డి దౌర్జన్యం చేస్తున్నాడని మండిపడ్డారు. కేసీఆర్, కేటీఆర్‌ను విమర్శించడమే ఆయన పనిగా పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. పచ్చని రాష్ట్రంలో చిచ్చు పెడుతున్న రేవంత్‌రెడ్డి నీచబుద్ధిని ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. కేసీఆర్‌పై కోపంతో తెలంగాణ తల్లి రూపాన్ని మారుస్తే తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకోబోదని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు చైతన్యవంతులని, రాబోయే రోజుల్లో ఛీత్కారం తప్పదని హెచ్చరించారు. అనంతరం బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి మాట్లాడుతూ.. కాంగ్రెస్‌కు ఓటు వేసిన ఏ ఒక్కరూ కూడా సంతోషంగా లేరని చెప్పారు. ఏడాది పాలనలో ఒక్క హామీనీ అమలు చేయకుండానే ప్రజాపాలన పేరిట విజయోత్సవ సభలు జరుపుకోవడం ఏంటని ప్రశ్నించారు. 3,500 మందికి డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తున్నామని చెప్పి, ఒక్క ప్రొసీడింగ్ ఇవ్వలేదన్నారు. సిరిసిల్ల పట్టణంలోనే 2,150 ఇండ్లు పూర్తి చేసి 1,900 కుటుంబాలకు అందించిన ఘనత బీఆర్ఎస్‌దే అని గుర్తుంచుకోవాలన్నారు. డ్రాలో మరో 800 మందికి మండెపల్లి ప్రాంతంలో పట్టాలు, ప్రొసీడింగ్‌లు ఇచ్చామని, కానీ, ఆ ప్రొసిడింగ్‌లను రద్దు చేసింది కాంగ్రెస్సేనని మండిపడ్డారు. డబుల్ బెడ్రూం ఇండ్లలోకి వెళ్లిన వారిని పోలీసులతో కొట్టిస్తున్నారని ఆరోపించారు. డ్రాలో అర్హత సాధించిన లబ్ధిదారులకు గతంలో కేటాయించిన ప్లాట్లను ఇవ్వాలని, ఇందిరమ్మ ఇండ్ల పేరు పెట్టుకోనైనా సరే అందించాలని సూచించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, న్యాలకొండ రాఘవరెడ్డి, ఎదురుగట్ల చంద్రయ్యగౌడ్, మాట్ల మధు, గుండ్లపల్లి పూర్ణ చందర్, పోచవేని ఎల్లయ్యయాదవ్, కుంబాల మల్లారెడ్డి, సత్తార్, సిలువేరి చిరంజీవి, ప్రేమ్ కుమార్, ఇమ్మనేని అమర్‌రావు, సురభి నవీన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

రాజన్న కోడెల దుర్వినియోగం!

- నిబంధనలు తుంగలో తొక్కి 60 కేటాయింపు?
- 49 విక్రయించినట్టు పోలీసుల నిర్ధారణ
- గీసుకొండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు
- పూర్తి వివరాల కోసం రాజన్న ఆలయ అధికారులకు నోటీస్

రాజన్న కోడెలు దుర్వినియోగం అవుతున్నట్టు తెలుస్తున్నది. భక్తులు సమర్పించిన నిజ కోడెలను పక్కదారి పట్టిస్తున్నట్టు వెలుగు చూస్తున్నది. గతంలో గోశాల ఫెడరేషన్ ద్వారా గోశాల నిర్వాహకులకు కోడెలను అందించే విధానం ఉండేది. అయితే, నకిలీ గోశాలల పేరిట కోడెలను తీసుకెళ్లి విక్రయిస్తున్న వ్యవహారం గత జనవరిలో స్టేషన్ ఘన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బయటపడింది. దీంతో అధికారులు మార్చి నుంచి పక్కాగా వివరాలు తీసుకొని రైతులకు అందిస్తున్నా.. తాజాగా మరోసారి కోడెలు దుర్వినియోగమైనట్టు తెలుస్తుండడం కలకలం రేపుతున్నది.

వేములవాడ, డిసెంబర్ 5 : వరంగల్ జిల్లా గీసుకొండ మండలం మనుగొండ గ్రామానికి చెందిన మాదాసు రాంబాబు వేములవాడ రాజన్న ఆలయ గోశాల నుంచి 60 కోడెలను తెచ్చి, అందులో 49 విక్రయించినట్టు అక్కడి వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నాయకులు నాలుగు రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అక్కడ తనిఖీ చేసి అందులో 11 కోడెలు మాత్రమే ఉన్నట్లుగా నిర్ధారించినట్లు తెలిసింది. రాంబాబుకు ఎన్ని కోడెలు కేటాయించారు? ఏ పద్ధతిన కేటాయించారు? ఎంతమందికి ఏ విధంగా ఇచ్చారు? అని పూర్తి వివరాల కోసం రాజన్న ఆలయ అధికారులకు గీసుకొండ పోలీస్ అధికారులు నోటీసు జారీ చేశారు. దీంతో మరోసారి కోడెల దుర్వినియోగం వ్యవహారం వెలుగు చూడడం చర్చనీయాంశంగా మారింది. అయితే పోలీసుల నోటిస్‌పై ఈవో వినోద్‌రెడ్డిని సంప్రదించగా, కోడెల దుర్వినియోగంపై తనకు గీసుకొండ పోలీసుల నుంచి లేఖ వచ్చిందని, రికార్డులు పరిశీలించి సమాచారం అందిస్తానని తెలిపారు. పోలీసుల నిర్ధారణ తర్వాత కేటాయింపు, ఏ మేరకు దుర్వినియోగం అయ్యాయి? స్థానిక ఉద్యోగుల కేమైన సంబంధం ఉన్నదా..? అనే అంశాలు కూడా తేలే అవకాశమున్నది. గతంలో న్యూ స్టేషన్‌ఘన్‌పూర్ పరిధిలో పట్టుబడిన కోడెల విషయంలోనూ రాజన్న ఆలయ ఉద్యోగిపై కేసు నమోదైంది. శాఖా పరమైన చర్యలు కూడా తీసుకున్నారు.

బీఎస్సీ ఫలితాలు విడుదల

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 5 : శాతవాహన యూనివర్సిటీ పరిధిలో బీఎస్సీ పరీక్షా ఫలితాలు విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా సెప్టెంబర్‌లో నిర్వహించిన బీఎస్సీ హానర్స్, డిజైనింగ్ అండ్ టెక్నాలజీ ఫలితాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచినట్లు వివరించారు. విద్యార్థులు ఫలితాల కోసం http://103.119.113.107:88, www.satavahana.ac.in లో చూసుకోవచ్చని సూచించారు.

సిరిసిల్ల సాంచాలపై పొంగల్ చీరెలు

- తమిళనాడు చీరెలతో సిరిసిల్ల నేతన్నకు ఊరట

బతుకమ్మ చీరెలు తయారీ లేక.. సర్కారు సాయం లేక ఆగమైన సిరిసిల్ల నేతన్నకు కాస్త ఊరట లభించింది. తమిళనాడు ప్రభుత్వం ఇచ్చిన పొంగల్ చీరెల తయారీతో ఉపాధి దొరకనున్నది. విడుతల వారీగా వస్త్రం తయారీకి ఆర్డర్లు రాగా, సిరిసిల్ల సాంచాలపై రోజుకు రెండు లక్షల మీటర్ల వస్త్రం తయారవుతున్నది. సుమారు వెయ్యి మంది కార్మికులకు ఉపాధి దొరుకుతున్నది.

సిరిసిల్ల పట్టణంలోని సాంచాలపై తయారవుతున్న పొంగల్ చీరెలు

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు చేయూతనిస్తూ కార్మికులకు చేతి నిండా పని కల్పించాలన్న ఉద్దేశ్యంతో కేసీఆర్ సర్కారు బతుకమ్మ చీరెల ఆర్డర్లు ఇచ్చింది. రాష్ట్రంలోని కోటి మంది తెల్లరేషన్ కార్డు లబ్ధిదారులకు బతుకమ్మ కానుకగా పంపిణీ చేసింది. పదేళ్లపాటు పని దొరికడంతో కార్మికులు సంతోషంగా గడిపారు. సర్కారు మారడం, బతుకమ్మ చీరెలు రద్దు కావడంతో ఏడాది కాలంగా ఉపాధి లేక అనేక మంది బతుకు జీవుడా అంటూ వలసబాట పట్టారు. దూరం వెళ్లేందుకు తాహతు లేని కార్మికులంతా స్థానికంగానే ఉంటూ తక్కువ కూలీతో పాలిస్టర్ వస్త్ర ఉత్పత్తులు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. కాటన్, పాలిస్టర్ కలయికతో చీరెల ఆర్డర్లు ఇచ్చి ఉపాధి కల్పిస్తామన్న ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలే తప్ప ఇంత వరకు చేసిందేమీలేదు. దీంతో ఇగొస్తది అగొస్తదన్న ఆశతో ఎదిరి చూసిన కార్మికులకు నిరాశే మిగిలింది.

తమిళ నాడు చీరెల ఆర్డర్లతో ఊరట

గత కేసీఆర్ ప్రభుత్వం బతుకమ్మ పండుగకు కానుకలు ఇచ్చినట్టే.. తమిళనాడు ప్రభుత్వం సంక్రాంతి (పొంగల్)కి మహిళలకు చీరెలు, పురుషులకు లుంగీలు పంపిణీ చేస్తున్నది. సిరిసిల్ల నేతన్నల నైపుణ్యం గుర్తించి, వీటి తయారీ ఆర్డర్లను దాదాపు పదిహేనేళ్లుగా సిరిసిల్లకు ఇస్తూ వస్తున్నది. ఎప్పటిలాగే ఈ యేడాది కూడా ఇచ్చింది. ఈ సారి రెండు కోట్ల మీటర్ల వస్త్రం తయారీకి ఆర్డర్లు ఇవ్వాలని నిర్ణయించి, సెప్టెంబర్ నుంచి విడుతల వారీగా ఇస్తున్నది. ఇటీవల దాదాపు 30లక్షల మీటర్ల వస్త్రం తయారీకి ఆర్డర్లు ఇచ్చింది. దీంతో వారం నుంచి మూడు వేల సాంచాలపై చీరెలు తయారు చేస్తున్నారు. వార్పు కాటన్, ప్యాక పాలిస్టర్ నూలుతో 62 పీక్సుల మందం, 5.50 మీటర్ల పొడువుతో రంగుల్లో రూపొందిస్తున్నారు. ప్రతిరోజూ రెండు లక్షల మీటర్ల వస్త్రాలు తయారు చేస్తున్నారు. వీటిని ఎప్పటికప్పుడు తమిళనాడుకు తరలిస్తున్నారు. ఈ చీరెల తయారీతో వెయ్యి మంది ఉపాధి పొందుతున్నారు. అందులో నేత కార్మికులు, వైపనీ, వార్పిన్, హమాలీ, ప్యాకింగ్, గుమస్తాలు ఉన్నారు. పొంగల్ చీరెల తయారీతో నెలకు ₹10 వేల నుంచి ₹13 వేలు వస్తున్నట్టు కార్మికులు తెలిపారు. ఉపాధిలేక ఇబ్బంది పడుతున్న తరుణంలో పొంగల్ చీరెలు తమకు ఉపాధి చూపుతున్నాయని చెబుతున్నారు.

తమిళనాడు నుంచి వచ్చిన నూలు, బీములు

సైజింగ్, వార్పిన్ ఇక్కడే

బతుకమ్మ చీరెల ఆర్డర్లు ప్రభుత్వం ఇవ్వక పోవడంతో 30 వేల మరమగ్గాలకు పనిలేకుండా పోయింది. అందులో కొన్ని సాంచాలు మాత్రమే నడుస్తుండగా, మిగిలినవి మూతపడ్డాయి. ఈ నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం ఇస్తున్న చీరెల తయారీకి సంబంధించి బీములు ఇక్కడే తయారు చేయాలని నిర్ణయించారు. తమిళనాడు ప్రభుత్వం నుంచి నూలు (కోములు) తెప్పించి ఇక్కడి సైజింగ్‌లపై బీములు పోసి, వార్పిన్ కార్మికులకు పనికల్పించేలా చర్యలు తీసుకుంటున్నారు. దీని వల్ల సైజింగ్, వార్పిన్ కార్మికులకు ఉపాధి లభించనున్నది.

ఆసాములు సంప్రదించాలి

తమిళనాడు చీరెల తయారీకి ఆసక్తి ఉన్న ఆసాములు వెంటనే నన్ను సంప్రదిస్తే బీములు ఇప్పిస్తాం. ప్రస్తుతం బతుకమ్మ చీరెలు లేవు. ఈ సమయంలో ఖాళీ ఉండకుండా ఐదు నెలలపాటు చీరెలు తయారీ చేస్తూ ఉపాధి పొందాలి. ఆత్మహత్యల నివారణకు తమిళనాడు చీరెలు ఆర్డర్లు తెచ్చి కార్మికులకు చేతి నిండా పని కల్పించాలన్నది ఉద్దేశ్యం. పనెలు, రీడ్ ఉచితంగా ఆసాములకు అందజేస్తాం. సిరిసిల్లతోపాటు గర్శకుర్తి, విలాసాగర్, గట్టుభూత్కుర్, చొప్పదండి నుంచి ఆసాములు వచ్చి బీములు తీసుకెళ్తున్నారు. మంచిర్యాల నుంచి సైతం సిరిసిల్లకు వచ్చి అమ్మ చీరెల తయారీకి ఆసక్తి చూపుతున్నారు. నాణ్యమైన చీరెలు తయారు చేస్తేనే మరిన్ని ఆర్డర్లు వస్తాయి. **- వేముల మార్కండేయులు, కమ్యూనిటీ ఫెసిలిటేటర్**

ఇది ప్రజా పాలనా..? ఎమర్జెన్సీనా..?

మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర, డిసెంబర్ 5 : రాష్ట్రంలో నడుస్తున్నది ప్రజా పాలనో ? లేక ఎమర్జెన్సీ పాలనో అర్థం కావడం లేదని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ దుయ్యబట్టారు. నిద్ర లేవకముందే ఎమ్మెల్యేల ఇంటి మీద పడి అక్రమంగా అరెస్టుకు ప్రయత్నించడం దుర్మార్గపు చర్య అని మండిపడ్డారు. ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం కాంగ్రెస్ నియంత పాలనకు సాక్ష్యంగా నిలుస్తున్నదని ధ్వజమెత్తారు. గురువారం గంగాధరలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన, మాజీ మంత్రి హరీశ్‌రావు, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అరెస్టును ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను నిలదీస్తూ.. రేవంత్‌రెడ్డి నిజస్వరూపాన్ని బట్టబయలు చేస్తూ.. ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న హరీశ్‌రావుపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ చేశారంటూ ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన కౌశిక్‌రెడ్డిపై ఉల్టా కేసు బనాయించడం దుర్మార్గమన్నారు. అడిగితే అరెస్టులు చేస్తారా..? ప్రశ్నిస్తే కేసులు, పెడతారా..? అని నిలదీశారు. బెదిరింపులకు, అక్రమ కేసులకు భయపడే వాళ్లు ఎవరూ లేరని, రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనను యావత్తు తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని, రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ సమాజమే బుద్ధి చెబుతుందని హెచ్చరించారు. సోషల్ మీడియాలో ఎవరో పెట్టిన పోస్టుకు సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో సంబంధంలేని కేసు పెట్టించారని మండిపడ్డారు. పార్టీ కార్యక్రమంలో మాట్లాడితే కోడిగుడ్డు మీద ఈకలు పీకినట్టు మానకొండూర్ పోలీస్‌స్టేషన్‌లో అక్రమ కేసు పెట్టించారని, సీఎం రెండు నాల్కల వైఖరిని బట్టబయలు చేసినందుకు, ప్రజాక్షేత్రంలో నిలదీసినందుకు తట్టుకోలేక పంజాగుట్ట స్టేషన్‌లో మరో తప్పుడు కేసు పెట్టించారని మండిపడ్డారు. ప్రజా కోర్టులో రేవంత్‌రెడ్డికి శిక్ష పడేవరకు ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకొని, వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.